క్లుప్తంగా

పోలింగ్ సరళిని పరిశీలించిన గ్రంధి


వీరవాసరం మండలంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: వీరవాసరం మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమా బాల పరిశీలించారు. పోలింగ్ శాతం వివరాలను ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు.

ఓటు వేసిన ప్రముఖులు


ఓటు వేయడానికి వచ్చి చేతిపై సిరా చుక్కు వేయించుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని బూత్ నంబర్ 116లో కలెక్టర్ సుమిత్‌కుమార్ దంపతులు ఓటువేశారు. అలాగే భీమవరం పట్టణంలోని గునుపూడి 117 బూత్‌లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఓటు వేయగా, ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ నాచువారి సెంటర్‌లోని పాట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లోని బూత్‌లో ఓటు వేశారు. నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల కుటుంబసభ్యులతో కలసి చింతలపాటి అచ్చుతరామరాజు మునిసిపల్ స్కూల్లోని 130వ పోలింగ్ బూత్‌లో ఓటు వేయగా ఆమె వెంట క్రిస్టియన్ మైనార్టీసెల్ చైర్మన్ మేడిది జాన్సన్ కూడా ఉన్నారు.

జగన్ మళ్లీ సీఎం అవ్వడం ఖాయం


విలేకర్లతో మాట్లాడుతున్న ఉండి అసెంబ్లీ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

ఆకివీడు: రాష్ట్రంలో మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని ఉండి అసెంబ్లీ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఈస్టుపాలెం స్కూల్‌లోని ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు మహిళల్లో మంచి స్పందన కల్పించాయని చెప్పారు. పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, కాపు కుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ సంక్షేమ పథకాల్ని అందజేశారని చెప్పారు. పథకాలను స్వాగతిస్తూ ప్రజలు ఓట్ల రూపంలో వారి మద్దతు తెలిపారని చెప్పారు. ఉండి నియోజకవర్గంలో అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కనుందని శ్రీలక్ష్మి చెప్పారు. మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని ప్రజలు ముందుగానే నిర్ణయించుకున్నారన్నారు. తమ మద్దతు తెలిపేందుకు అత్యధికంగా ఓట్లు వేసినట్లుగా స్పష్టమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ గేదల అప్పారావు, నాయకులు సురేష్ రెడ్డి, భగవాన్‌రెడ్డి, పడాల కిషోర్ రెడ్డి, ఇంటి సత్యనారాయణ, వల్లూరుపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సీఐను సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణుల డిమాండ్

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ 167వ నంబర్ పోలింగ్ బూత్‌లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కనుమూరి రఘురామకృష్ణరాజు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి గంట సేపు అక్కడ ఉండి ఓటర్లను ప్రభావితం చేశారని, పోలీసులు వారికి పూర్తి మద్దతు ఇచ్చారని, మాజీ సర్పంచ్ మంతెన సుబ్రహ్మణ్యం రాజు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆరోపించాయి. ఈ విషయమై తాము చూసి ఆయనను బయటకు పంపాలని డిమాండ్ చేయగా అక్కడ ఉన్న సీఐ ఆయన లేరని బయటకు వెళ్లిపోయారని అబద్ధం చెప్పారన్నారు. దాంతో తాము సాక్ష్యాలతో సహా వీడియో తీశామని మంతెన తెలిపారు. ఈ మేరకు ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇస్తున్న సీఐను సస్పెండ్ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావును ప్రశ్నించగా ఈవీఎం మిషన్ కొద్దిసేపు మొరాయించడం వల్ల వాటి గురించి వివరాలు తెలుసుకునేందుకు వెళ్లి ఉంటారని అన్నారు. మరి రఘురామరాజు కూడా ఎమ్మెల్యే మంతెన రామరాజు కూడా ఉన్నారని ఆయన రావాల్సిన అవసరం ఏంటి? అని ప్రశ్నించగా ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాబట్టి వెళ్లి ఉండవచ్చని అన్నారు.

భీమవరం.. ఓటర్ల ప్రభంజనం

- ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- సాయంత్రం 5 గంటలకు 63 శాతం పోలింగ్ నమోదు
- రాత్రి 9 గంటలకూ పోలింగ్ బూత్‌ల వద్ద భారీ క్యూలైన్లు

భీమవరం: భీమవరం పట్టణంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా అనేక పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు ఉదయం 6 గంటలకే చేరుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉండగా బూత్‌ల వద్ద రాత్రి 9 గంటలకు కూడా ఓటర్లు బారులుతీరి ఉండడం విశేషం. ఎండ ప్రభావం ఎక్కువ ఉండడంతో మహిళలు సైతం ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటికీ ఈవీఎంల నెమ్మదించడంతో క్యూలైన్లు ముందుకు సాగలేదు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో క్యూలైన్లలో ఓటర్లు పలచబడినప్పటికీ తిరిగి సాయంత్రం 4 గంటలకు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఓటర్లు ఎక్కువసేపు లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక పక్క ఎండ తీవ్రత, మరోపక్క ఉక్కబోతతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలింగ్ శాతం ఇలా..

భీమవరం నియోజకవర్గంలో మొత్తం 2,53,116 మంది ఓటర్లకుగాను ఉదయం 9 గంటలకు 9.12 శాతం ఓట్లు నమోదుకాగా, 11 గంటలకు 22.67 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 36.42 శాతం, 3 గంటలకు 47.9 శాతం, సాయంత్రం 5 గంటలకు 63.2 శాతం ఓట్లు పోలయ్యాయి. వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ అవకాశం కల్పించినప్పటికీ దానికి పెద్ద ప్రచారం లేకపోవడంతో పెద్ద సంఖ్యలో వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేశారు.

భీమవరం అర్బన్: భీమవరం మంలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప, తాడేరు, బేతపూడి, వెంప, కొవ్వాడ అన్నవరం, రాయలం, నాగిడి పాలెం, దొంగపిండి, లోసరి తదితర గ్రామాల్లోని 71 పోలింగ్ బూత్‌లలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ బూత్‌లకు చేరుకుని ఓటు వేసేందుకు బారులు తీరారు. స్టేట్ ఎన్నికల అబ్జర్వర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తాడేరు, దొంగపిండి, కొత్తపూసలమర్రు తదితర గ్రామాల్లో ఈవీఎమ్‌లు ఆలస్యంగా పనిచేయడంతో ఓటర్లు కొద్దిగా అసహనానికి గురయ్యారు. మండలంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు కుటుంబ సమేతంగా ఓటును వినియోగించుకున్నారు. రూరల్ పోలీసులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన నాగిడిపాలెం, లోసరి, దొంగపిండి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.


భీమవరం: పట్టణంలోని గునుపూడి పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు బారులు తీరి ఉన్న ఓటర్లు


భీమవరం: పట్టణంలో ఓటు వేసేందుకు క్యూలైన్లో నిలబడ్డ ఓటర్లు


భీమవరం: పట్టణంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


భీమవరం అర్బన్: తాడేరు జిల్లా హైస్కూల్లో ఓటర్ల క్యూ


భీమవరం అర్బన్: పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల క్యూ

ప్రశాంతంగా పోలింగ్


వాండ్రంలో ఈవీఎం మొరాయించడంతో ఓటు కోసం ఎదురుచూస్తున్న మహిళలు


చెరుకువాడలో ఓట్లు వేసేందుకు పోటెత్తిన మహిళా ఓటర్లు


వాండ్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు

- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- కొంత ఆలస్యంగా పోలింగ్
- సాయంత్రం 6 దాటినా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు

ఉండి: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లోని 54 పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో అందరూ ప్రశాంతంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. అయితే పోలింగ్ ప్రారంభ సమయంలో వాండ్రం గ్రామంలో 114 పోలింగ్ కేంద్రంలో సుమారు ఒకటిన్నర గంటల పాటు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే సిబ్బంది సమన్వయంతో ఈవీఎంను సిద్ధం చేయడంతో పోలింగ్ ప్రారంభమైంది. అలాగే పలు ప్రాంతాల్లో సుమారు అరగంట పాటు ఈవీఎంల సమస్యలతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభించారు. అలాగే పోలింగ్ సమయం గడిచిన తరువాత కూడా ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సమయానికి అనగా సాయంత్రం ఆరు గంటలకు ఎవరైతే ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్నారో? వారికి నంబర్లు ఇచ్చి గేట్లు మూసివేసిన అధికారులు వారితో పోలింగ్ నిర్వహించారు.నియోజకవర్గ వ్యాప్తంగా రాత్రి 8:30 గంటల సమయానికి 78 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

యండగండిలో ఓటు వేసిన పీవీఎల్

ఉండి: ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు సోమవారం పోలింగ్ సందర్భంగా ఆయన స్వగ్రామం యండగండిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.సతీసమేతంగా పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆయన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మాట్లాడుతూ ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయబోతున్నామని అన్నారు. ఇది జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలు ఇస్తున్న విజయమని అన్నారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి చెల్లించే కృతజ్ఞతగా ఉండి సీటును సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బహుమానంగా ఇస్తున్నామని ఆయన తెలిపారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలో ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. సాయంత్రం 6 గంటలకు 70 శాతం పైగా ఓటింగ్ పోలైంది. ఎలాంటి అవాంఛనీయ సంగటనలు జరగలేదు. ఈ మండలంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామ గ్రామాన సభలు సమావేశాలు పెట్టి శాంతియుతంగా ఎననికల జరిగేలా సహకరించాలని ఒంటరి వేస్తే వేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించి ఎన్నికలపై పూర్తి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. శృంగవృక్షం, పెన్నాడ పాఠశాలలో ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రంలో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటలకొద్దీ ఇబ్బంది పడ్డారు. పాలకోడేరు పోలింగ్ కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ సందర్శించి పరిశీలించారు. శృంగవృక్షం, కోరుకొల్లు వేండ్ర, పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు, ప్రజల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఉండి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.


శృంగవృక్షంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


పెన్నాడ అగ్రహారంలో ఈవీఎం పని చేయకపోవడంతో బారులు తీరిన ఓటర్లు


శృంగవృక్షంలో పోలింగ్ స్టేషన్ సందర్శించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు


భీమవరంలో పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధురాలికి సహకరిస్తున్న డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని

సేవలందించిన ఎన్‌సీసీ విద్యార్థులు

భీమవరం: పట్టణంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు సేవలందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ వీరయ్య పర్యవేక్షణలో ఎన్‌సీసీ విద్యార్థులు పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేయడానికి వచ్చిన వారిని క్రమపద్ధతిలో పోలింగ్ బూత్‌లకు పంపించారు. వృద్ధులు, వికలాంగులను దగ్గరుండి బూత్ లోపలికి తీసుకువెళ్లి ఓటు వేయించడానికి సహకరించారు.


భీమవరంలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో పంపిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థి

ఓటు వేసేందుకు ఉత్సాహంగా కదిలిన జనం


మండలంలోని చెరుకుమిల్లి గ్రామం జెడ్పీ స్కూల్‌లో భారీ క్యూలైన్‌లో ఓటర్లు


వృద్ధురాలిని ఓటు కోసం తీసుకువస్తున్న మహిళలు


చెరుకుమిల్లి ఎంపీపీ స్కూల్ పోలింగ్ బూత్ వద్ద కిక్కిరిసిన ఓటర్లు

ఆకివీడు: అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల అభ్యర్థులకు ఓటు వేసేందుకు సోమవారం ఓటర్లు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. మహిళలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని భారీ క్యూలో నిలబడ్డారు. ఎండను సహితం లెక్క చేయకుండా క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు కూడా ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వచ్ఛందంగా కేంద్రాలకు వచ్చారు. ఓటర్లకు ఆటోలు, ఇతర వాహనాలను ఆయా పార్టీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరి నిలబడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు జరిపి సంక్షేమ పథకాలకు మద్దతు తెలుపుతూ పలువురు మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెబుతున్నారు. పలు చోట్ల ఈవీఎంలు నత్తనడకన పని చేయడంతో ఓటర్లు ఇబ్బందిపడినప్పటికీ క్యూలైన్లలో ప్రశాంతంగా నిలబడి ఓట్లు వేశారు. ఓటర్లు అధికంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు రావడంతో పలు చోట్ల రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ జరిగింది.

దొడ్డిపట్లలో ఓటు వేసిన అనంత శ్రీరామ్

యలమంచిలి: ప్రముఖ సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ తన స్వగ్రామం దొడ్డిపట్లలో సోమవారం తన ఓటు వేశారు. తన తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తి, బంధువు సీతారామస్వామి నాయుడుతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చిన శ్రీరామ్ సాధారణ పౌరుడిలా వరుస క్రమంలో నుంచి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.


తన తండ్రి, బంధువుతో కలిసి ఓటు వేసిన సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్

ప్రశాంతంగా సాగిన ఎన్నికలు


కాళ్ల మండలంలో పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు


కాళ్ళ మండలంలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు

కాళ్ళ: మండలంలో 62 పోలింగ్ కేంద్రాల్లో సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతగా ముగిసింది.ఆయా గ్రామాల్లో ఓట్లు వినియోగించుకునేందుకు ఓటర్లు ఉదయం 7 గంటల నుండి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ సరళి మందకోడిగా సాగింది.మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే పీవీఎల్ నర్సింహరాజు మండలంలో పర్యటించి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్ ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంతో పాటు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.